ఎంపీడీఓ కార్యాలయం పైకప్పు దుస్థితి

విశాలాంధ్ర - గుమ్మలక్ష్మీపురం: ఎంపీడీఓ కార్యాలయ సమావేశ మందిరంలోని పై కప్పు దుస్థితి దయనీయంగా ఉంది. ఈ సమావేశ మందిరంలోనే అన్ని రకాల సమావేశాలు జరుగుతాయి. ఎక్కడో పాడుబడిన భవనంలా కనిపిస్తున్నప్పటికీ సాక్షాత్తు అన్ని రకాల సర్వసభ్య సమావేశాలతోపాటు, పలు రకాల సమావేశాలను, వీడియో కాన్ఫరెన్స్ లను, దృశ్య శ్రవణ సమావేశాలు నిర్వహిస్తుంటారు. కానీ ఈ సమావేశ మందిరాన్ని కనీసం పట్టించుకునే నాధుడే కనిపించడం లేదని పలువురు ఎంపీటీసీలు, సర్పంచులు, ప్రజాప్రతినిధులు వాపోతున్నారు. ప్రతి ఏడాది మండల పరిషత్ కార్యాలయానికి చిన్న చిన్న మరమ్మతుల కోసం, కార్యాలయం నిర్వహణ కోసం పలు రకాల నిధులు ప్రభుత్వం మంజూరు చేస్తుంటుంది. కానీ, ఆ నిధులు ఏమవుతున్నాయో కూడా తెలియని పరిస్థితి. కనీసం వెయ్యి రూపాయలు పెడితే సమావేశ మందిరం పైకప్పు సీలింగ్ పూర్తిగా తయారు చేయవచ్చు. కానీ గత మూడు నాలుగు సంవత్సరాల నుంచి ఈ సీలింగ్ పాడైపోయినప్పటికీ ఈ సమావేశం మందిరంలోనే సమావేశాలను ఏర్పాటు చేస్తున్నారు. జిల్లాస్థాయి అధికారులు కూడా అప్పుడప్పుడు వచ్చేటప్పుడు ఇదే సమావేశం మందిరంలో సమావేశాలను నిర్వహిస్తూ ఉంటారు. కనీసం వారికి కూడా సమావేశ మందిరం పైకప్పు కనిపించడం లేదేమోనని పలువురు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు సమావేశ మందిరం పైకప్పును మరమ్మతులు చేసి ఆకర్షవంతంగా తీర్చిదిద్దాలని పలువురు కోరుతున్నారు.

జిల్లా ఆసుపత్రి సూపరింటెండెంట్‌గా నాగ శివజ్యోతి

విశాలాంధ్ర - బెలగాం: పార్వతీపురం జిల్లా ఆసుపత్రి నూతన సూపరింటెండెంట్‌గా డాక్టర్ వై.నాగ శివజ్యోతి సూపరింటెండెంట్‌గా ఉన్న డాక్టర్ బి.వాగ్దేవి నుంచి శుక్రవారం పదవీ బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా డాక్టర్ నాగ శివజ్యోతి మాట్లాడుతూ ప్రజలకు నాణ్యమైన వైద్య సేవలు అందించడమే లక్ష్యమని, ఉన్నత వైద్య సేవలు అందించడంలో రాజీ పడేదిలేదన్నారు. ఉద్యోగులు, డాక్టర్లు, పారా మెడికల్ సిబ్బంది, ఫోర్త్ క్లాస్ ఎంప్లాయిస్ సహకారంతో ప్రజలకు మెరుగైన సేవలు అందించి పార్వతీపురం జిల్లా ఆసుపత్రి ఖ్యాతి మరింత పెంపొందిస్తామని అన్నారు. ఆసుపత్రి సిబ్బంది అంతా ఆమెను కలసి శుభాకాంక్షలు తెలిపారు.

ఘనంగా గుడ్ ఫ్రై డే

విశాలాంధ్ర - వీరఘట్టం: మండల కేంద్రంలోని తెలుగు బాప్టిస్ట్ దేవాలయం, ఆర్.సి.యం, ఇమ్మానియేలు, సీయోను ప్రార్థన మందిరంతో పాటు తలవరం, బిటవాడ, నడుకూరు, వండువ, తూడి, నీలానగరం, కంబర, గడగమ్మ, కొట్టుగుమ్మడ, నర్సిపురం తదితర గ్రామాల్లో శుక్రవారం గుడ్ ఫ్రైడే వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆర్.సి.యం చర్చి ఫాదర్ రాజ్ ఆధ్వర్యంలో కస్పా వీధి నుండి ప్రధాన రహదారి మీదుగా ఆర్.సి.యం చర్చి వరకు యేసు శిలువ వేసినట్టు భక్తుల వేషధారణ అలంకరణతో ర్యాలీగా వెళ్లి ప్రచారం చేపట్టారు. తెలుగు బాప్టిస్ట్ దేవాలయంలో పాస్టర్ వి.శంకర్ ఏసుక్రీస్తు సిలువలో పలికిన ఏడు మాటలు గూర్చి భక్తులను ఉద్దేశించి మాట్లాడారు.

సాకి గెడ్డపై చెక్ డ్యాం నిర్మించాలి

విశాలాంధ్ర - పార్వతీపురం రూరల్: మండలంలోని తాళ్లబురిడి గ్రామం మీదుగా ప్రవహిస్తున్న సాకి గెడ్డపై చెక్ డ్యాం నిర్మించి, మరిన్ని ఎకరాలకు సాగు నీరు అందేలా చూడాలని శుక్రవారం ఆయకట్టు రైతులు ఎమ్మెల్యే విజయ్ చంద్రను కలిసి కోరారు. సాకి గెడ్డ మూలంగా ఎన్నో వందల ఎకరాలు సస్యశ్యామలంగా పండుతుందని, ఆ ప్రాంతంలో చెక్ డ్యాం నిర్మిస్తే మరిన్ని ఎకరాలకు సాగునీరు అందుతుందని రైతులు ఎమ్మెల్యేకు తెలిపారు. జీవగెడ్డ అయిన సాకి గెడ్డపై కూటమి ప్రభుత్వం దృష్టిసారించి రైతులకు న్యాయం చేయాలని కోరుతూ వినతిపత్రం అందజేశారు.

కార్యకర్త కుటుంబాన్ని పరామర్శించిన పుష్ప శ్రీవాణి

విశాలాంధ్ర - గుమ్మలక్ష్మీపురం: గుమ్మలక్ష్మీపురం మండలంలోని వంగర గ్రామంలో పంచాయతీ సర్పంచ్ తిరుపతి తల్లి మృతి చెందిన విషయం తెలుసుకున్న కురుపాం మాజీ ఎమ్మెల్యే పాముల పుష్ప శ్రీవాణి శుక్రవారం పరామర్శించి ధైర్యం చెప్పారు. కార్యకర్తలు తమ గుండెల్లో ఎల్లప్పుడూ ఉంటారని అన్నారు. ఈమె వెంట ఎంపీపీ కె.ధీనమయ్య, వైస్ ఎంపీపీ ఎన్.శేఖర్, వైసిపి మండల నాయకులు, సర్పంచ్‌లు, ఎంపీటీసీ లు, కార్యకర్తలు పాల్గొన్నారు.

డయేరియా వ్యాధి పట్ల అవగాహన

విశాలాంధ్ర - పాలకొండ/వీరఘట్టం: డయేరియా అంటువ్యాధుల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని పంచాయతీ కార్యదర్శి బొమ్మాలి ప్రసాదు అన్నారు. శుక్రవారం పాలకొండ మండలం వెలగవాడ గ్రామంలో అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఇంటింటికి వెళ్లి అంటువ్యాధులకు సంబంధించిన కరపత్రాలను పంచిపెట్టారు. ఫ్రైడే డ్రై డే నినాదాలు చేశారు. నిరంతరం వేడి నీటిని తాగాలని, చల్లని పదార్థాలకు దూరంగా ఉండాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఏఎన్ఎం గౌరీశ్వరి, సచివాలయ సిబ్బంది, గ్రామ ప్రజలు, సబ్ సెంటర్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

నవధాన్యాలను వినియోగించుకోవాలి

వ్యవసాయ అధికారి తిరుపతిరావు

విశాలాంధ్ర - పాచిపెంట: ప్రస్తుత వేసవి కాలంలో అడపాదడపా వర్షాలు పడుతున్నందున రైతులు దుక్కులు దున్ని నవధాన్యాలు చల్లుకుంటే నేల సారవంత మవుతుందని వ్యవసాయ అధికారి కే.తిరుపతిరావు అన్నారు. కర్రివలస గ్రామంలో రైతు నారాయణరావు 10 ఎకరాలకు నవధాన్య విత్తనాలను చల్లారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ నవధాన్య విత్తనాలు సాధారణ పచ్చిరొట్ట విత్తనాల కంటే మెరుగ్గా నేల లోపల, నేల బయట జీవ వైవిధ్యాన్ని పెంచి పర్యావరణాన్ని కాపాడుతూనే నేలను సారవంతం చేస్తుందని అన్నారు. కాబట్టి రైతులందరూ నవధాన్యాలను తప్పకుండా చల్లుకోవాలని సూచించారు. ఏకపంట విధానంలో ప్రతి సీజన్లో ఒకే పంట వేస్తుండడం వలన ఒకే రకమైన వేరు వ్యవస్థలు ఒకే రకమైన జీవజాలానికి నిలయంగా మారుతాయని అప్పుడు ఒకే రకమైన పోషకాల లభ్యత మాత్రమే పంటకు అందుతుందన్నారు. మండ లంలో 2000 కేజీల నవధాన్యాలను రైతులకు పంపిణీ చేయడం జరిగిందని వీటిని ప్రస్తుతం వెయ్యబోయే మొక్క జొన్న, పత్తి పంటలకు ముందుగా చల్లుకుని కలియ దున్నుకోవాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎల్ టు విజయ్, ఐసి ఆర్పి సుమలత, ప్రకృతి సిబ్బంది పాల్గొన్నారు.

ఉపాధి పని దినాలకు ముందుగానే వసూళ్లు

విశాలాంధ్ర - మక్కువ: మండలంలో ఇటీవల ప్రారంభమైన ఉపాధి హామీ పథకంలో వారం రోజులు పని దినాలకు ముందుగానే 100 రూపాయలు ఇవ్వాలని కొంతమంది సిబ్బంది అడుగు తున్నట్లు సమాచారం. ఒకే ఇంట్లో రెండు జాబ్ కార్డులను కూడా జారీ చేసినట్లు తెలుస్తోంది. ఆ జారీ చేసిన జాబ్ కార్డు గల వ్యక్తులు స్థానికంగా లేకపోయిన ప్పటికీ చెరో సగం నిష్పత్తిలో వాటాలు పడుతున్నా యన్నది జగమెరిగిన సత్యం. గత ఏడాది వంద రూపాయలకు అలవాటు పడ్డ సిబ్బంది ఈ ఏడాది వినూత్నంగా పని దినాలు పూర్తి అవకుండానే వారం రోజులకు సరిపడా ముందుగానే 100 సమర్పించాలని హుకుం జారీ చేసినట్లు సర్వత్ర గుసగుసలు వినపడుతున్నాయి. ఈ ఏడాదైనా అధికారులు దృష్టిసారించి వేతనదారుల వద్ద వందకు వసూళ్లకు చెక్ పెట్టాలని వేతనదారులు కోరుకుంటున్నారు. ఇదిలా ఉండగా వేతనదారులు రెండు పూటలా పనిచేయాల్సి ఉన్నప్పటికీ అధికారులు వేతనదారుల వద్ద డబ్బులు తీసుకున్న కారణంగా ఒక్క పూట పనికి పరిమితం అవుతున్నారని అర్థమవు తోంది. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి పనికి తగ్గ వేతనం వేతనదారులకు ఎటువంటి కోతలు లేకుండా ఇప్పించాల్సిందిగా పలువురు కోరుకుంటున్నారు.

గడసింగుపురంలో ఎక్సైజ్ దాడులు

విశాలాంధ్ర - జియ్యమ్మవలస: మండలంలోని గడసింగుపురం పంచాయతీ కేంద్రంలో శుక్రవారం నాటుసారా తయారీ స్థావరాలపై ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ శాఖ ఆధ్వర్యంలో దాడులు నిర్వహించారు. కురుపాం ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ సిఐ పి.శ్రీనివాసరావు ఆధ్వర్యంలో జరిగిన ఈ దాడులలో 7 డ్రమ్ములు నిండుగా ఉన్న పులిసిన బెల్లపు ఊటలను ధ్వంసం చేస్తూ 10 లీటర్ల నాటు సారాను స్వాధీనం చేసుకున్నారు. తయారీదారులు ఎవరో దర్యాప్తు నిర్వహించి చర్యలు తీసుకుంటామన్నారు. అదేవిధంగా ముడిసరుకు సప్లై చేస్తున్న వీరఘట్టం గ్రామానికి చెందిన వ్యాపారిపై కేసు నమోదు చేయనున్నట్లు ఆయన తెలిపారు. ఈ దాడుల్లో సీతానగరం ఎక్సైజ్ సిఐ పద్మావతి, దత్తత తీసుకున్న గజపతినగరం ఎస్ఐ నరేంద్ర కుమార్, బొబ్బిలి ఎస్ఐ శ్రావణ్ కుమార్, కురుపాం ఎస్ఐలు జె.రాజశేఖర్, పి.చంద్రకాంత్‌లు పాల్గొన్నారు.

అఖిల భారత కిసాన్ జాతీయ సమితికి ఎన్నికైన బుడితి

విశాలాంధ్ర - పాలకొండ: తమిళనాడు రాష్ట్రం నాగపట్నంలో ఈనెల 15,16,17 తేదీలలో అఖిలభారత కిసాన్ సభ 30వ జాతీయ మహాసభలు ఆహ్లాద కరమైన వాతావరణంలో జరిగాయి. ఢిల్లీ నడిబొడ్డున 13 నెలల కాలం పాటు లక్షలాది మంది రైతాంగంతో చేసిన వీరోచిత రైతాంగ ఉద్యమ చరిత్ర కలిగిన అఖిల భారత కిసాన్ సభ 30వ జాతీయ మహాసభలకు దేశ నలుమూలల నుండి హాజరైన ప్రతినిధులు 115 మందితో నూతన జాతీయ సమితిని ఎన్నుకోవడం జరిగింది. అఖిల భారత కిసాన్ జాతీయ సమితికి బుడితి అప్పలనాయుడును ఎన్నుకోవడం జరిగింది. బుడితి ఎన్నిక పట్ల ఆంధ్ర ప్రదేశ్ రైతు సంఘం ఉత్తరాంధ్ర జిల్లా సమితి నాయకులు హర్షం వ్యక్తం చేశారు. విజయనగరం, పార్వతీపురం జిల్లా అధ్యక్షులు నారు జనార్ధనరావు, గౌరవ అధ్యక్షులు గురుబిల్లి అప్పలనాయుడు, జిల్లా ఉపాధ్యక్షులు చందక కేశవరావు, కోశాధికారి బొత్స గౌరు నాయుడు, కౌలు రైతుల సంఘం జిల్లా అధ్యక్షులు కిమిడి రామ్మూర్తి నాయుడు, వండాన కూర్మారావు, కనపాక చౌదరి నాయుడు, మామిడి వెంకట సూర్యనారాయణ, వివిధ ప్రజా సంఘాల నాయకులు రైతులు అభిమానులు బుడితి అప్పల నాయుడుకు అభినందనలు తెలిపారు.

బలిజిపేటలో పరిశుద్ధ సిలువ యాత్ర

విశాలాంధ్ర - బలిజిపేట: మండల కేంద్రం బలిజిపేటలో గుడ్ ఫ్రైడేను పురస్కరించుకొని క్రైస్తవ సోదరులు పరిశుద్ధ సిలువ మార్గాన్ని నిర్వహించారు. వెంగాపురం చర్చ్ విచారణ కర్త కిల్లాడ ఆనంద్ ఆధ్వర్యంలో క్రైస్తవ భక్తులు బలిజిపేట హెూలీ స్పిరిట్ నుంచి ప్రధాన వీధుల గుండా వెంగాపురం ఆర్.సి.యం చర్చి వరకు పరిశుద్ధ సిలువ మార్గాన్ని నిర్వహించారు. ఏసు క్రీస్తు వేషధారణలో వ్యక్తి సిలువ మోస్తుండగా బటులు కొరడాలతో కొడుతున్న సన్నివేశం పలువురిని విశేషంగా ఆకట్టుకుంది. క్రైస్తవ సోదరులు క్రైస్తవ గీతాలు ఆలపిస్తూ యాత్రలో పాల్గొన్నారు. మండలంలోని వెంగాపురం, బలిజిపేట, తుమరాడ, పలగర, పదమ్మాయవలస, చాకరాపల్లి, మిర్తివలస, బర్లి పెద్ద పెంకి తదితర గ్రామాల నుంచి వందలాది మంది పాల్గొన్నారు.

ఏజెన్సీలో రేబిస్ వ్యాధిపై ఆందోళనలు

రాబిస్ సోకి వైద్యారోగ్య శాఖ ఉద్యోగిని మృతి

విశాలాంధ్ర - చింతపల్లి: ఏజెన్సీలో ప్రాణాంతకమైన రేబిస్ వ్యాధిపై సర్వత్రా ఆందోళనలు వ్యక్తమవుతున్నాయి. ఇందుకు వైద్య ఆరోగ్యశాఖలో పని చేస్తున్న ఉద్యోగిని రేబిస్ వ్యాధికి గురై మృతి చెందడంతో ఈ ఆందోళనలకు మరింతగా ఊతం ఇస్తున్నాయి. మన్య ప్రాంతంలో ఇప్పటి వరకు మలేరియా, డెంగ్యూ, చికెన్ గున్యా, అతిసారం, విష జ్వరాలు, పచ్చకామెర్లు వంటి వ్యాధులతో ఆసుపత్రులలో చేరి చికిత్స పొందిన వారు మాత్రమే ఉండేవారు. ఇటీవల కుక్క కాటుకు గురై రేబిస్ వ్యాధితో మరణించిన వారి గురించి ప్రస్తుతం హాట్ టాపిక్ అయింది. మన్య ప్రాంతంలో గడిచిన కొన్నేళ్లలో రేబిస్ వ్యాధితో మరణించిన వారి గురించి మాట్లాడుకొనే పరిస్థితి లేదు. అయితే ఇటీవల మండలంలోని లోతుగెడ్డ ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలోని బెన్నవరం ఆరోగ్య ఉప కేంద్రం/ఆయుష్మాన్ ఆరోగ్య మందిర్‌లో మిడ్ లెవెల్ హెల్త్ ప్రొవైడర్ (ఎం ఎల్ హెచ్ పి)గా పనిచేసిన గసాడి రమ్యశ్రీ కుక్క కాటుకు గురై, రేబిస్ వ్యాధితో మరణించిందన్న వార్త ఈ ప్రాంతీయులను ఆందోళనకు గురి చేసింది. అలాగే పెదబయలు మండలం లోని నాల్గవ తరగతి చదువుతున్న విద్యార్థి కుక్క కాటుకు గురై రేబిస్ వ్యాధితో మరణించడం, ఈ రెండు కేసులు విశాఖ కింగ్ జార్జ్ ఆసుపత్రిలో నమోదు కావడం, పైగా రోజుల తేడాలోనే వీరిరువురు రేబిస్ వ్యాధితో మరణించారని కింగ్ జార్జ్ ఆసుపత్రి వైద్యాధికారులు ధ్రువీకరించడంతో మన్య ప్రాంత వాసులలో మరింత ఆందోళన కలిగిస్తోంది. ఏజెన్సీ ప్రాంతంలో ఇప్పటివరకు కుక్కకాటుకు గురైన కేసుల గురించి మాత్రమే వింటుండే వారు. ప్రస్తుతం రేబిస్ వ్యాధికి గురై, మరణించిన కేసుల సంఖ్యను గురించి మాట్లాడుకోవడం ప్రస్తుతం వింటున్నాము. గడిచిన సంవత్సర కాలంలో కుక్క కాటు బారిన పడి చింతపల్లి ఏరియా ఆసుపత్రిలో వైద్యం పొందే నిమిత్తం సుమారుగా 562 మంది కుక్క కాటుకు గురైన కేసులుగా నమోదయ్యాయి. దీంతో కుక్క కాటుకు గురైన వారి సంఖ్య అయితే వందల్లో ఉన్నప్పటికీ రేబిస్ వ్యాధికి గురైన వారి సంఖ్య మాత్రం ఇప్పటివరకు లేదనే చెప్పవచ్చు.

గిరి యువకునికి గిన్నిస్ బుక్‌లో చోటు

గిన్నిస్ బుక్ ఆఫ్ వరల్డ్ రికార్డ్‌తో గిరి యువకునికి అరుదైన గౌరవం
మాజీ ఎంపీపీ వంతల బాబురావు

విశాలాంధ్ర - చింతపల్లి: మండలంలోని కొమ్మంగి పంచాయతీ పొర్లు బంధ గ్రామానికి చెందిన వంతల దీవెన్ ప్రదీప్‌కు గిన్నిస్ బుక్ ఆఫ్ వరల్డ్ రికార్డ్ లో చోటు దక్కడం హర్షణీయమని మాజీ ఎంపీపీ వంతల బాబురావు (బాబి) అన్నారు. శుక్రవారం ఆయన మాట్లాడుతూ గంట వ్యవధిలో కీ బోర్డు ప్లే చేసి ఇన్ స్టాగ్రామ్‌లో పోస్ట్ చేసిన కార్యక్రమంలో పాల్గొన్న 1046 మందిలో పొర్లుబంధ గ్రామానికి చెందిన వంతల దీవెన్ ప్రదీప్‌కు అరుదైన గౌరవం దక్కింది. ఎంటెక్ విద్యనభ్యసించి అవంతి ఇంజినీరింగ్ కళాశాలలో కంప్యూటర్ సైన్స్ అండ్ ఇంజనీరింగ్ డిపార్ట్మెంట్లో అసిస్టెంట్ ప్రొఫెసర్‌గా పనిచేస్తు మ్యూజిక్ పట్ల ఉన్న ఆసక్తి కారణంగా పాస్టర్ అగస్టీన్ దండంగి ఆధ్వర్యంలో గత ఏడాది డిసెంబర్ 1న విజయవాడ హాలెల్ మ్యూజిక్ పాఠశాలలో నిర్వహించిన గిన్నిస్ బుక్ ఆఫ్ వరల్డ్ రికార్డ్స్‌కి అంతర్జాతీయంగా ఆహ్వానం అందుకని హాజరయ్యాడన్నారు. ఎనిమిది దేశాల నుండి 1046 విద్యార్థులు పాల్గొని ఒక గంట వ్యవధిలో కీబోర్డ్ ప్లే చేసి ఇన్‌స్టా గ్రామ్‌లో పోస్ట్ చేసిన కార్యక్రమంలో పోస్ట్ చేసిన వీడియోలను గిన్నిస్ బుక్ ఆఫ్ వరల్డ్ రికార్డ్స్ ప్రతినిధులు పరిశీలించి ఎంపిక చేయగా ఇందులో వంతల దీవెన్ ప్రదీప్ చోటు దక్కించుకుని గిన్నిస్ బుక్ ఆఫ్ వరల్డ్ రికార్డుకు ఎంపిక కావడమే గాక హైదరాబాదులో ఈనెల 14న (సోమవారం) మణికొండలో జరిగిన గిన్నిస్ బుక్ ఆఫ్ వరల్డ్ రికార్డ్స్ ఈవెంట్లో పాస్టర్ ఆగస్టీన్ దండంగి చేతుల మీదుగా వంతల దీవెన్ ప్రదీప్‌కు మెడల్‌తోపాటు ధ్రువీకరణ పత్రం అందజేయడం అభినందనీయం అన్నారు. గిరి యువకునికి ఇంతటి అరుదైన గౌరవం దక్కడం పట్ల ఆయన హర్షం వ్యక్తం చేశారు.

సీపీఎం నేతల కుటుంబాలను పరామర్శించిన సింగు

విశాలాంధ్ర - వి.ఆర్.పురం: సీపీఐ, ఏఐటీయూసీ తెలంగాణ రాష్ట్ర కార్యదర్శి సింగు నరసింహారావు, కూనవరం ప్రముఖ రైతు కామ్రేడ్ యాలం సీతారామయ్య, సీపీఐ మండల కార్యదర్శి కర్నాటి రాంబాబు శుక్రవారం మండలంలోని రేఖపల్లి గ్రామంలో కామ్రేడ్ స్వర్గీయ పూనం సత్యనారాయణ, చిన్నమట్టపల్లి గ్రామంలోని కామ్రేడ్ మాజీ ఎంపీపీ స్వర్గీయ కారం శిరమయ్య, సున్నం వారి గూడెం గ్రామంలోని కామ్రేడ్ మాజీ ఎమ్మెల్యే స్వర్గీయ సున్నం రాజయ్య కుటుంబ సభ్యులను పరామర్శించి తమ ప్రగాఢ సానుభూతిని తెలిపారు. ఈ కార్యక్రమంలో సిపిఎం నాయకులు సున్నం రాజులు, మేకల నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

పాడేరులో భారీ వర్షం: నేలమట్టమైన వృక్షాలు

విశాలాంధ్ర - పాడేరు: అల్లూరి జిల్లా పాడేరు కేంద్రంలో శుక్రవారం కురిసిన భారీ వర్షాలకు పాలిటెక్నిక్ కళాశాల, మెడికల్ కాలేజ్, సాయిబాబా గుడి సమీపంలో భారీ వృక్షాలు నేలమట్టం కావడంతో, ఒక ద్విచక్ర వాహనం పూర్తిగా ధ్వంసం అయింది. అటుగా వెళ్లే వాహనాలు సుమారుగా మూడు నాలుగు గంటల వరకు నిలిచిపోయాయి దీంతో ట్రాఫిక్ సమస్య మరింతగా పెరిగింది. పట్టణంలో విద్యుత్ వైర్లు తెగిపడడంతో విద్యుత్ అంతరయం ఏర్పడింది. పోలీస్ సిబ్బంది రెవెన్యూ పంచాయతీ అధికారులు, విద్యుత్ అధికారులు, చొరవతో విరిగిపడిన చెట్లను తొలగించి సుమారుగా మూడు గంటల తర్వాత యధావిధిగా రాకపోకలు సాగింది. ఈ వృక్షాలు విరిగిపడిన సమయంలో ఎవరు లేకపోవడంతో ఎటువంటి ప్రమాదం జరగలేదు.

చర్చిల్లో క్రైస్తవ సోదరుల ప్రార్ధనలు

విశాలాంధ్ర - హుకుంపేట: శుభ శుక్రవారాన్ని మండల కేంద్రంలో క్రైస్తవ సోదరులు ఘనంగా నిర్వహించారు. ఈ పండగను పురస్కరించుకుని మండల కేంద్రంలో బెతేస్థా ప్రార్ధన మందిరంలో క్రైష్ణవులు శుక్రవారం ఉదయం నుంచి ఉపవాసాలు ఉంటూ ప్రత్యేక ప్రార్ధనలు నిర్వహించారు. కామయ్యపేట జంక్షన్ వద్ద బెతేస్థా చర్చి పాస్టర్ సాల్మన్‌రాజ్ ఆధ్వర్యంలో విశాఖపట్నం సియోను మందిరం పాస్టర్ శివశంకర్ లాజరస్ (యాసిడ్ శివ) సంఘం కలసి హుకుంపేటలో క్రీస్తు సిలువతో భారీ ర్యాలీ చేపట్టారు. శుక్రవారం ఉదయం నుంచి మండల కేంద్రంలో పలు వీధుల్లో తిరుగుతూ యేసు సిలువ మరణం గురించి, సిలువలో యేసు ప్రభు పలికిన ఏడు బంగారు మాటల గురించి క్రైస్తవులకు వివరించారు. ఆనంతరం ప్రార్థనలకు వచ్చిన సూమారు 200 మందికి క్రైస్తవులకు ప్రత్యేక ఆహారం ఏర్పాటు చేశారు. మరి కొన్ని చర్చల్లో 410 రోజుల పాటు ఉపవాసాలు ఉంటూ ప్రతి రోజు ప్రార్థనలు నిర్వహించారు. ఏ పాపం చేయాని యేసు ప్రభు పాపుల కోసం సిలువలో మరణం పొంది ప్రజల కోసం కార్చిన రక్తం గురించి వివరించారు. ఈ కార్యక్రమంలో బెతేస్థా ప్రార్ధన మందిరం పాస్టర్ అమ్మ ఎస్తేరురాణి, సంఘ సభ్యులు ఇస్తారు, చార్లెస్, మోహన్ రాజారావు, ఫిలిప్పు తదితరులు పాల్గొన్నారు.

బీభత్సం సృష్టించిన గాలి వాన

విశాలాంధ్ర - కొయ్యూరు: మండలంలో బీభత్సం సృష్టించిన గాలి వర్షం కారణంగా వివిధ ప్రాంతాల్లో చెట్లు నేలకొరిగి పోవడంతో ట్రాఫిక్‌కు తీవ్ర అంతరాయం ఏర్పడి వాహన దారులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు. పెద్ద మాకవరం జాతీయ రహదారిపై చింత చెట్టు కూలిపోవడంతో రాకపోకలు నిలిచి పోయాయి. అలాగే నడింపాలెం గ్రామ సమీపంలో ఆర్ అండ్ బి రోడ్డుపై చెట్టు విరిగివడ్డాయి. గంటపాటు వాహనాలు రాకపోకలు నిలిచిపోవడంతో గ్రామానికి చెందిన యువకులు స్వచ్ఛందంగా ముందుకు వచ్చి భారీ చెట్టును తొలగించి రాకపోకలకు అంతరాయం లేకుండా చేశారు.

మార్గమధ్యలో ప్రసవం తల్లీ బిడ్డ క్షేమం

విశాలాంధ్ర - సీలేరు: జీకేవీధి మండలం దుప్పులవాడ పంచాయతీ డి.అగ్రహారానికి చెందిన ఆశా వర్కర్ కె.సుబ్బమ్మ తన గ్రామానికి చెందిన నిండు గర్భిణి అల్లంగి శాంతికి సకాలంలో వైద్య సహాయం అందించాలనే తపన సత్ఫలితాన్ని ఇచ్చింది. నిండు గర్భిణీ అల్లంగి శాంతి ప్రసవం కోసం 18 కిలోమీటర్ల దూరంలో ఉన్న సీలేరు ఆసుపత్రికి అంబులెన్సులో తీసుకు వెళ్తుండగా మార్గమధ్యలో ప్రసవ నొప్పులు ప్రారంభమ్యాయి. దీంతో ఏ మాత్రం ఆలస్యం చేయకుండా అప్రమత్తమైన ఆశా వర్కర్ సుబ్బమ్మ అక్కడున్న వారి సహాయంతో వెంటనే ప్రాథమిక వైద్యం అందించారు. సుబ్బమ్మ చూపిన సమయస్ఫూర్తి ధైర్యంతో గర్భిణీ స్త్రీ అల్లంగి శాంతి సురక్షితంగా ఆడబిడ్డకు జన్మనిచ్చింది. తల్లీబిడ్డ ఇద్దరూ క్షేమంగా ఉండటంతో గ్రామస్తులు ఆశా వర్కర్ సుబ్బమ్మకు అభినందనలు తెలిపారు.

బీకర గాలి వర్షానికి కూలిన భారీ వృక్షం

- తప్పిన ప్రాణాపాయం

విశాలాంధ్ర - జీకే వీధి: మండలంలోని ఆర్‌వి నగర్ పంచాయతీ కేంద్రంలో ఎప్పుడు వాహనాలు ప్రయాణికులతో రద్దీగా ఉండే ఆర్.వి.నగర్ ప్రధాన కూడలి వద్ద మూడు గంటల సమయంలో బీకర గాలి వర్షానికి భారీ వృక్షం దుకాణాల మధ్యలో నుంచి రోడ్డుపై విరిగిపడింది. ఈ సమయంలో ప్రయాణికులు వాహనచోదకులు ఎవరు ఆ పరిసరాలలో లేకపోవడంతో పెద్ద ప్రాణ ప్రమాదం తప్పిందని దుకాణదారులు, వాహన చోదకులు గ్రామస్తులు తెలిపారు. రింతాడ పంచాయతీ కదుగుల గ్రామంలో భారీ పిడుగుకి పూరిగుడిసె దగ్ధమైందని, ఈ ప్రమాదంలో ఎవరికి ఎటువంటి ప్రాణ నష్టం జరగక పోవడంతో గ్రామస్తులు ఊపిరి పీల్చుకుందామని కదుగుల గ్రామస్తులు తెలిపారు.

ఆదివాసి ప్రాంతంలో కాఫీ ఏర్పాటు చేయాలి

- నిరుద్యోగులకు ఉపాధి అవకాశాలు కల్పించాలి
- ఆదివాసి గిరిజన సంఘం డిమాండ్

విశాలాంధ్ర - అరకులోయ: ప్రపంచ ప్రఖ్యాతి గాంచిన ఆర్గానిక్ కాఫీ ఉత్పత్తి చేస్తున్న ఆదివాసి ప్రాంతం పాడేరు ఐటీడీఏ పరిధిలో కాఫీ పరిశ్రమ ఏర్పాటు చేసి ఆదివాసి నిరుద్యోగులకు ఉపాధి అవకాశాలు కల్పించాలని ఆదివాసి గిరిజన సంఘం అల్లూరి జిల్లా కమిటీ డిమాండ్ చేసింది. అరకులోయ ఆదివాసి గిరిజన సంఘం భవనంలో శుక్రవారం ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆదివాసి గిరిజన సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి పొద్దు బాలదేవ్, మండల అధ్యక్షులు జి.చిన్నబాబు, మండల ఉపాధ్యక్షులు కిల్లో జగన్నాథం మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం అనకాపల్లి జిల్లాలో కాఫీ పరిశ్రమ ఏర్పాటు చేస్తామని ప్రకటించడం ఆదివాసులకు తీవ్ర అన్యాయం చేయడమేనని, పాడేరు ఐటీడీఏ 11 మండలాల పరిధిలో ప్రపంచ ప్రఖ్యాతిగాంచిన ఆర్గానిక్ కాఫీ ఆదివాసి రైతులు పండిస్తున్నారని సుమారు లక్షల 30 వేల మంది రైతులు 2 లక్షల ఎకరాల్లో 15 వేల మెట్రిక్ టన్నుల కాఫీ ఉత్పత్తి చేస్తున్నారన్నారు. ఆదివాసి ప్రాంతంలో కాఫీ పరిశ్రమలు ఏర్పాటు చేయకుండా మైదాన ప్రాంతంలో కాఫీ పరిశ్రమ ఏర్పాటు చేస్తామని ప్రకటించడం ఎవరి ప్రయోజనం కోసమని ప్రశ్నించారు. 2018 నుండి నేటి వరకు ఆర్గానిక్ కాఫీ పండిస్తున్న రైతులకు సుమారు 60 కోట్ల బకాయి తక్షణమే చెల్లించాలని, కాఫీ తోటల అభివృద్ధి కోసం ప్రోత్సాక నిధులు విడుదల చేయాలన్నారు. కాఫీ తోటలకు ఇన్సూరెన్స్ సౌకర్యం కల్పించాలని, కాఫీ తోటలో ప్రమాదానికి గురవుతున్న రైతులకు బీమా పథకం వర్తింపజేయాలని డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో గిరిజన సంఘం నాయకులు కిల్లో దొబులు పాల్గొన్నారు.

విశాలాంధ్ర
పేజి: 2
అల్లూరి సీతారామరాజు
పార్వతీపురం మన్యం
శనివారం 19, ఏప్రిల్ 2025

భక్తిశ్రద్ధలతో గుడ్ ఫ్రైడే ర్యాలీ

విశాలాంధ్ర - పాలకొండ: సర్వ మానవాళి రక్షణ కోసం యెహోవా దేవుని కుమారుడు క్రీస్తు సిలువపై బలి అర్పణ చేయడమే గుడ్ ఫ్రైడే అని స్థానిక ఆర్ సి ఎం చర్చ్ ఫాదర్ సుందర్‌రావు తెలియజేశారు. శుక్రవారం క్రీస్తు సిలువ మరణానికి సంబంధించి రెండు వేల ఏళ్ళ క్రితం జరిగిన పరిణామాలపై క్రీస్తు వేషధారణతో పాలకొండ పట్టణ పురవీధుల్లో ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా క్రైస్తవ సోదరులు సిలువలు పట్టుకొని లోక రక్షకుని సిలువ మరణం పట్ల ఆవేదనతో గీతాలాపన చేశారు. అనంతరం దేవాలయం వద్ద ఏర్పాటుచేసిన క్రీస్తు సిలువకు ముందు జరిగిన సంఘట నలను గుర్తు చేసుకుంటూ ప్రత్యేకప్రార్థన చేశారు క్రైస్తవ సోదరులు ఉచిత మజ్జిగ ప్యాకెట్లను భక్తులకు పంపిణీ చేశారు.

కారం రాజులు మరణం పార్టీకి తీరనిలోటు

విశాలాంధ్ర - వి.ఆర్.పురం: సీనియర్ కామ్రేడ్ కారం రాజులు మరణం పార్టీకి తీరని లోటని సిపిఎం జిల్లా కమిటీ సభ్యులు సోయం చినబాబు అన్నారు. శుక్రవారం అల్లూరి సీతారామరాజు జిల్లా మండలంలోని గుర్రంపేట గ్రామంలో అనారోగ్య కారణాలతో మరణించిన కారం రాజులు మృతదేహాన్ని సందర్శించి ఆయన మృతదేహంపై పార్టీ జెండాను కప్పి నివాళులర్పించారు. ఆయనకు ఊహ తెలిసినప్పటినుండి సిపిఎం పార్టీని నమ్ముకొని పార్టీ సిద్ధాంతాల పట్ల నిబద్ధతను కలిగిన వ్యక్తిగా కొనసాగారని ఆయన మరణం పార్టీకి తీరని లోటని అన్నారు. అనంతరం వారి కుటుంబ సభ్యులను పరామర్శించి ప్రగాఢ సానుభూతి తెలిపారు. ఈ కార్యక్రమంలో మండల ఎంపీపీ కారం లక్ష్మి, మండల కార్యదర్శి పులి సంతోష్ కుమార్, మండల కమిటీ సభ్యులు పొడియం శ్రీరామ్ మూర్తి, కారం సుందరయ్య పాల్గొన్నారు.

వక్ఫ్ సవరణ చట్టాన్ని వెంటనే ఉపసంహరించండి

విశాలాంధ్ర - వి.ఆర్.పురం: వక్ఫ్ చట్ట సవరణ బిల్లును పార్లమెంట్ ఆమోదించడాన్ని సీపీఎం (మార్క్సిస్ట్) మండల కమిటీ తీవ్రంగా ఖండించింది. ఈ మోడీ ప్రభుత్వ విధానాలు రాజ్యాంగంపై మైనారిటీ హక్కులపై దాడి చేస్తున్నాయని, దేశ లౌకిక కూర్పుని దెబ్బతీస్తూ మతపరంగా చీలికలను పెంచుతున్నాయని ఈ చట్ట సవరణను వ్యతిరేకిస్తూ ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర కమిటీ పిలుపుమేరకు విఆర్ పురం మండల కేంద్రంలోని మసీదు వద్ద ముస్లిం సోదరులను కలిసి ప్రజాశక్తి ప్రచురించిన వక్ఫ్ చట్ట ప్రత్యేక సంచికను ముస్లిం సోదరులకు పంచిపెట్టడం జరిగింది. ఈ కార్యక్రమంలో మండల పార్టీ కార్యదర్శి పులి సంతోష్ కుమార్, మండల కమిటీ సభ్యులు పోడియం శ్రీరామ్ మూర్తి, శీరపు తాతబాబు తదితరులు పాల్గొన్నారు.

పోచవరం - కాచవరం గ్రామాలను మొదటి ఫేజ్‌లో కలపాలి

విశాలాంధ్ర - కూనవరం: పోచవరం - కాచవరం గ్రామాల పోలవరం నిర్వాసితుల సమస్యలను అరకు పార్లమెంటు తెలుగు యువత అధికార ప్రతినిధి గడేసుల రంజిత్ కుమార్ జల వనరుల శాఖ మంత్రి నిమ్మల రామానాయుడు దృష్టికి తీసుకువెళ్లి వినతి పత్రం ఇవ్వడం జరిగింది. ఈ రెండు గ్రామాలను 41.5 కాంటూరులో కలపాలని 2013 పరిహార చట్టం ప్రకారం అందరితో పాటుగా ఇక్కడ నిర్వాసితులకు కూడా పరిహారం ఇవ్వాలని వినతిపత్రంలో పేర్కొన్నారు. గతంలో ఎకరాకు 10 లక్షలు ఇస్తామన్న హామీకి బదులుగా ప్రస్తుతం పెరిగిన రిజిస్ట్రేషన్ ధరలకు అనుకూలంగా భూమి పరిహారం పెంచి ఇవ్వాలని కోరారు. దీనిపై సానుకూలంగా స్పందించిన మంత్రి సంబంధిత అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో శీలం నాగేశ్వరరావు, సుభాని, మడకం నాగేశ్వరరావు, వెంకటేష్, రామారావు, ఏడుకొండలు తదితరులు పాల్గొన్నారు.

బావిలో దూకి వృద్ధుడు ఆత్మహత్య

విశాలాంధ్ర - పార్వతీపురం రూరల్: మండలంలోని ఎల్ఎన్ పురం గ్రామానికి చెందిన జక్కు దాలి నాయుడు (82) అనే వృద్ధుడు ఇంటి సమీపంలో గల నూతిలో దూకి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. గత కొద్ది రోజులుగా అనారోగ్యంతో బాధపడుతున్న దాలినాయుడు భార్య గతంలో మృతి చెందడంతో ఒంటరిగా జీవిస్తున్నాడు. మృతునికి ఇద్దరు కుమారులు, ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. వారందరికీ వివాహం కావడంతో వారి వారి వైవాహిక జీవితాన్ని గడుపుతున్నారు. శుక్రవారం విషయం తెలుసుకున్న రూరల్ ఎస్ఐ సంతోషిణి తన సిబ్బందితో మృతదేహానికి పంచనామ నిర్వహించి, పోస్టుమార్టం నిమిత్తం పార్వతీపురం జిల్లా ఆసుపత్రికి తరలించారు.

అగ్ని ప్రమాదాల నివారణపై అవగాహన

విశాలాంధ్ర - బెలగాం: అగ్నిమాపక వారోత్సవాలలో భాగంగా అగ్ని ప్రమాదాలు సంభవించినపుడు తీసుకోవలసిన జాగ్రత్తలు, అగ్ని ప్రమాదాలను సమర్థవంతంగా ఎదుర్కొనేందుకు పార్వతీపురం అగ్నిమాపక కేంద్ర అధికారి జి.ప్రభాకరరావు ఆధ్వర్యంలో తన సిబ్బందితో శుక్రవారం పార్వతీపురం హెచ్పీ గ్యాస్ గొడౌన్ వద్ద సిబ్బందికి అవగాహనా కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా వివిధ రకములైన అగ్నిప్రమాదాలు సంభవించే వేళ తీసుకోవాల్సిన నివారణ చర్యలపై, ఎల్.పి.జి లీకు అయినప్పుడు తీసుకోవలసిన చర్యలు, గ్యాస్ డెలివరీ చేసేటపుడు, రవాణా చేసే సమయంలో తీసుకోవలసిన జాగ్రత్తలపై గ్యాస్, ఎలక్ట్రికల్ వలన కలిగే అగ్నిప్రమాదాల గురించి అక్కడ ఉన్న వినియోగదారులకు, గ్యాస్ గొడౌన్ సిబ్బందికి అవగాహన కల్పించే విధంగా తన సిబ్బందితో ఫైర్ డెమో నిర్వహించారు. అగ్ని ప్రమాదాలు జరిగినప్పుడు తీసుకోవాల్సిన ముందస్తు జాగ్రత్తలను, నివారణ చర్యలను ఫైర్ డెమో నిర్వహించి వారికి అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో హెచ్పీ గ్యాస్ డీలర్ పెంటపాటి సాయికిరణ్ కుమార్, పార్వతీపురం అగ్నిమాపక కేంద్రం సిబ్బంది, గ్యాస్ గొడౌన్ సిబ్బంది పలువురు వినియోగదారులు పాల్గొన్నారు.

శ్రీ ఎర్ర కొండమ్మ జాతర పోస్టర్ ఆవిష్కరణ

విశాలాంధ్ర - కొయ్యూరు: శరభన్నపాలెం, నడింపాలెం గ్రామాల మధ్య వెలసిన గిరిజనుల ఆరాధ్య దైవం శ్రీ ఎర్ర గొండమ్మ జాతర మహోత్సవాలు పోస్టర్‌ను ఆలయ కమిటీ ఆధ్వర్యంలో శుక్రవారం ఆలయ ప్రాంగణంలో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆలయ కమిటీ చైర్మన్ గొడ్డేటి మహేష్ మాట్లాడుతూ ఈనెల 20 నుండి 23 వరకు నాలుగు రోజులు పాటు ఎర్ర కొండమ్మ అమ్మవారి జాతర మహోత్సవాలు నిర్వహించడం జరుగుతుందన్నారు. నాలుగు రోజులపాటు వివిధ సాంస్కృతిక కార్యక్రమాలు ఏర్పాటు చేయడం జరిగిందని తెలిపారు. ఈ కార్యక్రమంలో శరభన్నపాలెం సర్పంచ్ కిముడు సత్యనారాయణ, మాజీ సర్పంచ్ దారకొండ నారాయణమూర్తి, ఉప సర్పంచ్ సంపరి త్రిమూర్తులు, నడింపాలెం సూపర్ సర్పంచ్ పనసల రాము, నడింపాలెం పిసా కమిటీ అధ్యక్షులు మాతే రాధాకృష్ణ, జనసేన పార్టీ నాయకులు జుర్రా ప్రకాష్, సుమర్ల వెంకటరమణ తదితరులు పాల్గొన్నారు.

అంతరాష్ట్ర రోడ్డు నిర్మాణ పనులు ప్రారంభించాలి

విశాలాంధ్ర - సీలేరు: జీకేవీధి మండలం ఆర్వీనగర్ నుంచి వై.రామవరం మండలం పాలగెడ్డ వరకు గల అంతరాష్ట్ర రోడ్డు నిర్మాణ పనులు ప్రారంభించేలా చర్యలు తీసుకోవాలని శుక్రవారం ఆర్వీనగర్ పాలగెడ్డ రోడ్డు సాధన కమిటీ చింతపల్లి ఏఎస్పీ నవజ్యోతిమిశ్రాకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఆర్వీనగర్ నుంచి పాలగెడ్డ వరకు రహదారిగోతులమయంగా తయారైందన్నారు. ఈ రహదారిలో తెలంగాణ, ఒడిశా, ఛత్తీష్‌ఘడ్ రాష్ట్ర ప్రజలతోపాటు దారకొండ ఘాట్ రోడ్డులో కొలువుదీరిన దారాలమ్మ ఆలయంను దర్శించుకోవడం కోసం నిత్యం వచ్చే భక్తులు, సీలేరు, డొంకరాయి, పొల్లూరు జలవిద్యుత్ కేంద్రాల సందర్శనకు వచ్చే పర్యాటకులతో పాటు జీకేవీధి మండలం ప్రాంతం నుంచిఅత్యవసరంగా గర్భిణీలను, ఆసుపత్రికి తరలించాలన్నా ఇతర రోజులను మైదాన ప్రాంతాలకు తరలించాలన్నా, మైదాన ప్రాంతాల నుంచి వ్యాపారస్తులు నిత్యం జీకేవీధి మండలంలో జరిగే సంతలకు రావాలన్నా తీవ్రమైన ఇబ్బందులను ఎదుర్కొంటున్నారని తెలిపారు. ఈ రహదారి నిర్మాణం కోసం గత 15 సంవత్సరాలుగా ప్రభుత్వాలు నిధులు మంజూరు చేస్తునప్పటికీ పనులు మాత్రం ప్రారంభించడం లేదన్నారు. గత సెప్టెంబర్ 8న వచ్చిన తుపాన్ ప్రభావంకు జీకేవీధి నుంచి పాలగెడ్డ వరకు రోడ్డు, కల్వర్టులు కొట్టుకుపోయి నెల రోజుల పాటు రాకపోకలు నిలిచిపోయి తీవ్రమైన ఇబ్బందులకు గురయ్యామని తెలిపారు. తుపాన్ ప్రభావానికి గాలికొండ, దారకొండ, దుప్పులవాడ, గుమ్మిరేవుల పంచాయిల్లోని అనేక గ్రామాలకు కల్వర్టులు, రోడ్లు, పంట పొలాలు, పశువులకు తీవ్రమైన నష్టం వాటిల్లిందని, ప్రభుత్వంపైన తెలిపిన సమస్యలను పరిష్కరించలేదన్నారు. ప్రభుత్వం పైన తెలిపిన సమస్యలను పరిష్కరించాలని కోరుతూ రాజకీయాలకు అతీతంగా అన్ని పార్టీలకు చెందిన నాయకులంతా రోడ్డు సాధన కమిటీగా ఏర్పాటు చేసుకున్నామని, ప్రజల శ్రేయస్సు కొరకు ఆదివారం దారకొండ నుంచి గంగవరం జంక్షన్ వరకు తలపెట్టిన శాంతియుత ర్యాలీకి అనుమతులు ఇవ్వాలని ఏఎస్పీని కోరారు. ఈ మేరకు ఏఎస్పీ సానుకూలంగా స్పందిస్తూ ఈ అంశాన్ని సంబంధిత అధికారులు, జిల్లా కలెక్టర్ దృష్టికి తీసుకువెళ్లి రోడ్డు పనులు ప్రారంభమయ్యేలా కృషి చేస్తానని హామీ ఇచ్చారని వారు తెలిపారు. ఆదివారం దారకొండ నుంచి గంగవరం జంక్షన్ వరకు జరిగే ర్యాలీలో ఐదు పంచాయతీల ప్రజలు హాజరై జయప్రదం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో గాలికొండ ఎంపిటిసి అంపురంగి బుజ్జిబాబు, సీలేరు మాజీ ఉప సర్పంచ్ కారే శ్రీనివాస్, జనసేన మండల ఉపాధ్యక్షులు బత్తుల సిద్ధార్థ మార్క్, గిరిజన సంఘం మండల అధ్యక్షులు బాకూరు కోటేశ్వరరావు, గుమ్మిరేవుల మాజీ సర్పంచ్ పూజారి బాబురావు తదితరులు పాల్గొన్నారు.

రహదారి విస్తరణ పనుల నేపథ్యంలో పొంచి ఉన్న ప్రమాదాలు

- వంతెనలు, ముఖ్య కూడళ్ల వద్ద గోతులు
- హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేయాలి

విశాలాంధ్ర - చింతపల్లి: జాతీయ రహదారి విస్తరణ నిర్మాణ పనుల కారణంగా తీసిన గుంతలు వాహన చోదకుల పాలిట గుదిబండలుగా తయారయ్యాయి. ఈ విస్తరణ పనుల కారణంగా ప్రమాదాల బారిన పడి ఎంతోమంది వాహన చోదకులు ప్రాణాలు కోల్పోయారు. చింతపల్లి, జీ కె వీధి మండలాలలోనే గాక అటు జి.మాడుగుల, పాడేరు మండలాలలోనూ ఇదే పరిస్థితి. చింతపల్లి, జీకె వీధి మండలాల విషయానికి వస్తే ఇప్పటికే చాలా వరకు నిర్మాణ పనులు పూర్తి కావస్తున్నప్పటికి, వంతెనలు, ముఖ్య కూడళ్ళ వద్ద పనులు మాత్రం నెమ్మదిగా సాగుతున్నాయి. దీని వలన ప్రమాదాలు సంభవిస్తున్నాయి. మండల కేంద్రంలో హనుమాన్ కూడలి వద్ద రహదారిని తవ్విన గుత్తేదారు హెచ్చరిక బోర్డు లు ఏర్పాటు చేయక పోవడంతో ప్రమాదాలు సంభవించే అవకాశం ఉందని వాహన చోదకులు, ప్రయాణీకులు, గ్రామస్తులు అభిప్రాయం వ్యక్తం చేస్తున్నారు. ఈ నేపథ్యంలో ఈ నెల 24 నుంచి 27 వరకు నాలుగు రోజులపాటు చింతపల్లి లో గ్రామదేవత ముత్యాలమ్మ అమ్మవారి జాతర ఏర్పాట్లు జరుగుతున్నాయి. ఈ జాతరకు గ్రామస్తుల ఇళ్లకు బందువులు, స్నేహితులు, శ్రేయోభిలాషులు, అదే క్రమంలో చింతపల్లి, జీ కె వీధి మండలాలకు చెందిన ముత్యాలమ్మ అమ్మవారి భక్తులు అధిక సంఖ్యలో రానున్న నేపథ్యంలో వారికి ఎటువంటి అసౌకర్యం కలుగకుండా, ప్రమాదాలకు తావు లేకుండా చూడవలసిన బాధ్యత జాతీయ రహదారి విస్తరణ నిర్మాణ పనులు చేపడుతున్న గుత్తేదారునిపై ఉంది.

దోమల వ్యాప్తి నిర్మూలనకు చర్యలు: డా. జగన్మోహన్

విశాలాంధ్ర - బెలగాం: దోమల వ్యాప్తి నిర్మూలించడానికి డ్రైడే అందరికీ అనువైన, సులభమైన, ఉత్తమమైన పద్ధతి అని ఆరోగ్యశాఖ జిల్లా ప్రోగ్రాం అధికారి డాక్టర్ టి.జగన్మోహన్‌రావు పేర్కొన్నారు. పార్వతీపురం మండలం వెంకంపేట గ్రామంలో ఫ్రైడే-డ్రైడే కార్యక్రమాన్ని శుక్రవారం పర్యవేక్షణ చేశారు. ఇంటి పరిసరాల్లో నీరు నిల్వ ఉండటానికి ఆస్కారం ఉన్న ప్రదేశాలు, పాడైన, నిరుపయోగంగా ఉన్న ప్లాస్టిక్ డబ్బాలు, కుండీలు, టైర్లు, వాడని రుబ్బురోళ్ళు, ప్లాస్టిక్ కప్పులలో నీటి నిల్వలు గుర్తించి పారబోయించారు. దోమల లార్వా పెరగడానికి అనువుగా ఉన్న ప్రదేశాలను గ్రామంలో గుర్తించి వెక్టార్ కంట్రోల్ హైజీన్ యాప్‌లో వైద్య సిబ్బంది మొబైల్ ఫోన్ ద్వారా అప్లోడ్ చేయడం జరిగింది. పంచాయతీ సిబ్బందితో కలిసి తదుపరి నివారణ చర్యలు చేపట్టాలని సూచించారు. రానున్న కాలంలో జ్వరాలు ప్రబలకుండా ఉండాలంటే దోమల వ్యాప్తిని అరికట్టాలని ఇందుకు అనేక పద్ధతులు ఉన్నాయని, అయితే డ్రైడే నిర్వహణ ఆచరించడానికి ప్రతీ ఒక్కరికీ అనువైన, సులభమైన మార్గం అని, అంతేకాక చిన్నచిన్న లార్వా ప్రదేశాలను కూడా గుర్తించి, నిర్మూలనకు ఉత్తమైన మార్గమని తెలిపారు. అనంతరం గ్రామంలో ఎన్సీడి సర్వే తీరుపై ఆరా తీసి ఆన్లైన్ నమోదు పరిశీలించారు. ఈ కార్యక్రమంలో ఎపిడెమిక్ ఈఓ సత్తిబాబు, వైస్ ఎంపిపి ఎస్. జగన్నాథం, సూపర్వైజర్ జయగౌడ్, ఏఎన్ఎం జీవం రత్నం, ఆశ కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

ప్రజాస్వామ్యబద్ధంగా టీడీపీ సంస్థాగత ఎన్నికలు

విశాలాంధ్ర - కురుపాం: కురుపాం నియోజకవర్గంలో తెలుగుదేశం పార్టీ సంస్థాగత ఎన్నికల విషయంలో తెలుగుదేశం పార్టీ ఎన్నికల కమిటీ ఆదేశానుసారం పార్టీ యొక్క నియమ నిబంధనలకు లోబడి గ్రామ కమిటీల నుండి మండల స్థాయి, నియోజకవర్గ స్థాయి, పార్లమెంట్ మరియు రాష్ట్ర స్థాయి కమిటీల నిర్మాణం పార్టీ ఎన్నికల నియమావళికి లోబడి ప్రజాస్వామ్యబద్ధంగా నిర్వహించడం జరుగుతుందని కురుపాం నియోజకవర్గ పరిశీలకులు తెలుగుదేశం పార్టీ రాష్ట్ర కార్యదర్శి ఆరేటి మహేష్ బాబు తెలియజేశారు. ప్రతి మండలంలోనూ విస్తృత స్థాయి సమావేశాలు ఏర్పాటు చేసి బూత్ స్థాయి నుంచి అభిప్రాయ సేకరణ తీసుకోవడం పోటీ ఉన్నచోట ఐవీఆర్ఎస్ ద్వారా మెజారిటీ అభిప్రాయాన్ని పరిగణలోకి తీసుకోవడం, పోటి లేని చోట ఏకగ్రీవంగా ఆమోదించడం జరుగుతుంది. కావున తెలుగుదేశం పార్టీ ఎన్నికల నియామావళికి సంబంధించి తెలుగుదేశం పార్టీ కుటుంబ సభ్యులు పత్రికా ముఖంగా ఎటువంటి ప్రకటనలు గాని వివాదాస్పద వ్యాఖ్యలు కానీ చేయకూడదని వివిధ హోదాలలో ఉన్న నాయకులను తెలుగుదేశం పార్టీ ఆదేశించడం జరుగుతుంది. మీకు ఏమైనా సమస్యలు ఉన్నా, ఇబ్బందికరమైన పరిస్థితులు ఉన్నా కురుపాం నియోజకవర్గ ఎమ్మెల్యే గారి దృష్టికి గాని, కురుపాం నియోజకవర్గ పరిశీలకుల దృష్టికి గాని తీసుకొని సమస్య పరిష్కరించుకోవాలే తప్ప బహిరంగంగా ఎటువంటి ప్రకటనలను చేయరాదని తెలియజేస్తున్నామని తెలిపారు.

క్రికెట్ టోర్నీని ప్రారంభించిన జమాల్ ఖాన్

విశాలాంధ్ర - వి.ఆర్.పురం: ఆటలు ఆరోగ్యంతోపాటు అందరిలోనూ స్నేహ భావాన్ని ఐక్యతను పెంపొందిస్తాయని దురలవాట్లను దూరం చేస్తాయని, శక్తి సామర్థ్యాలను కలిగిస్తాయని మానసిక స్థైర్యం, ధైర్యం పెంపొందిస్తాయని ప్రముఖ ఆయుర్వేద వైద్యులు జెకె సెట్ ట్రస్ట్ చైర్మన్ ఎండి జమాల్ ఖాన్ పేర్కొన్నారు. టిడిపి సీనియర్ నాయకులు జంగాల మల్లికార్జునరావు ప్రీమియర్ లీగ్ క్రికెట్ టోర్నమెంట్ శుక్రవారం విఆర్ పురం మండలం కళాశాల మైదానంలో ప్రారంభించిన సందర్భంగా యువతను ఉద్దేశించి వారు మాట్లాడుతూ మద్యపానం, ధూమపానం వంటి ప్రమాదకరమైన వాటికి బానిస కాకుండా దేశానికి వెన్నెముకగా యువత శక్తివంతంగా కావాలని అన్నారు. చింతూరు మండలం ఎర్రంపేట వి.ఆర్.పురం మండలం జీడిగుప్ప పంచాయతీ పరిధిలోని ములకపల్లి గ్రామానికి చెందిన రెండు జట్లు తలబడుతున్నాయి. టాస్ గెలిచిన ఎర్రంపేట బ్యాటింగ్ ఎంచుకుంది. ఈ క్రికెట్ టోర్నమెంట్‌కు మొదటి మనీ ప్రైస్ జంగాల మల్లికార్జునరావు 30 వేల రూపాయలు, ద్వితీయ ప్రైజ్ మనీ ఎండి జమాల్ ఖాన్ 20వేల రూపాయలను బెస్ట్ విన్నర్స్ రన్నర్స్‌కు 30000 రూపాయల విలువైన మెమెంటోలను క్రీడా నిర్వాహకులకు అందజేయడం జరిగింది. ఈ కార్యక్రమంలో మాజీ జెడ్పిటిసి ముత్యాల రామారావు, తెలుగు యువత నాయకులు బొర్ర నరసింహారావు, శంకర్రావు, టోర్నమెంట్ కమిటీ సభ్యులు వేముల అజయ్, శ్రావణ్, రామారావు తదితరులు పాల్గొన్నారు.

సభ్యత్వ నమోదును వేగవంతం చేయండి

విశాలాంధ్ర - చింతపల్లి: తెదేపా అధిష్టానం ఆదేశాల మేరకు, ప్రతి 30 మంది ఓటర్స్ కి ఒక కుటుంబ సాధికార సారధిలు నియమించాలనే ఉద్దేశంతో శుక్రవారం చింతపల్లి తెదేపా మండల అధ్యక్షుడు కిల్లో పూర్ణచ్చందరావు ఆధ్వర్యంలో అంజలి శనివారం, కిటుముల పంచాయితీలలో తెదేపా సభ్యత్వం కార్డులు అందజేసి, కుటుంబ సాధికార సారధులను నియమించారు. అదే క్రమంలో పంచాయితీలలో ఉన్న స్థానిక సమస్యలు గురించి చర్చించారు. ఈ కార్యక్రమం లొ గ్రామ అధ్యక్షులు వెంకటరావు, యూనిట్ ఇంచార్జ్ పరమేశ్వరావు, చంద్రబాబు నాయుడు, సంజీవ్, రామారావు, కేశవ, తెలుగుయువత అధ్యక్షులు గాణి, బుజ్జినాయుడు,, దేముడు బాబు, ప్రభాకర్, ఐ టిడిపి ఇంచార్జ్ మహేంద్ర, గ్రామస్థులు పాల్గొన్నారు.

ఆటంకాలు లేకుండా అమ్మవారి జాతర జరగాలి

విశాలాంధ్ర - చింతపల్లి: గ్రామ దేవత శ్రీ ముత్యాలమ్మ అమ్మవారి జాతర ఎటువంటి ఆటంకాలు జరగాలని ఎంపీపీ కోరాబు అనూష దేవి, జెడ్పీటీసీ సభ్యుడు పోతురాజు బాలయ్య అన్నారు. ఈ నెల 24 నుంచి 27 వరకు నిర్వహించనున్న చింతపల్లి గ్రామదేవత శ్రీ ముత్యాలమ్మ అమ్మవారి జాతరను పురస్కరించుకుని శుక్రవారం అమ్మవారి ఆలయ ప్రాంగణంలో స్థానిక మహిళలతో కలిసి వారు ముహూర్తపు రాట వేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ నాలుగు రోజుల పాటు నిర్వహించే ఈ ముత్యాలమ్మ అమ్మవారి జాతర ఎటువంటి ఆటంకాలు లేకుండా జరగాలని అన్నారు. ఈ కార్యక్రమంలో స్థానిక ఎంపీటీసీ సభ్యురాలు చిందాడ జయలక్ష్మీ, మండల కో ఆప్షన్ సభ్యుడు షేక్ నాజర్ వల్లి, ఉత్సవ కమిటీ ప్రధాన కార్యదర్శి పసుపు లేటి వినాయకరావు, వర్తక సంఘం ప్రధాన కార్యదర్శి పెదిరెడ్ల బేతాళుడు, సత్యవేణి దంపతులు పాల్గొన్నారు.

ఉపాధి హామీ పనులను పరిశీలించిన ఎంపీపీ

విశాలాంధ్ర - వి.ఆర్.పురం: మండల పరిధిలోని గుల్లేటి వాడ గ్రామం వద్ద జరుగుతున్న జాతీయ ఉపాధి హామీ పథకం పనులను శుక్రవారం స్థానిక ఎంపీపీ కారం లక్ష్మి పరిశీలించారు. ఎండలు తీవ్రంగా ఉండడం వలన మట్టి పని సరిగ్గా జరగడం లేదని సరైన కూలీ పడడం లేదని కూలీలు తెలిపారు. అటవీ హక్కుల చట్టం ప్రకారం గుల్లేటివాడ గ్రామంలోని గిరిజనులకు పోడు భూముల పట్టాలు గతంలో ఇచ్చారని, వాటిలో ఎన్ఆర్ఈజీఎస్ ద్వారా చెరువు నిర్మాణాల పనులు చేపడుతుంటే సంబంధిత ఫారెస్ట్ అధికారులు అడ్డుపడుతున్నారని, దానివలన పని దొరకకపోగా ఇబ్బందులు పడే అవకాశం ఉందని తెలిపారు. వెంటనే స్పందించిన ఎంపీపీ సంబంధిత చింతూరు ఫారెస్ట్ రేంజ్ ఆఫీసర్‌ని సంప్రదించగా విషయం తెలుసుకున్న సదరు అధికారి వారి కింద స్థాయి సిబ్బందిని వెంటబెట్టుకుని గుల్లేటి వాడ గ్రామానికి విచ్చేసి గ్రామస్తులతో సమావేశమై వారికున్న సమస్యలను తెలుసుకొని పరిష్కారానికి హామీ ఇచ్చారు. పోడు భూముల హక్కు పత్రాలు వాస్తవమే అని అందులో జరిగే ఉపాధి పనిని ఫారెస్ట్ డిపార్ట్మెంట్ వారు ఎవరు అడ్డుకోరని ఫారెస్ట్ రేంజర్ తెలియజేశారు. ఈ కార్యక్రమంలో పార్టీ జిల్లా కమిటీ సభ్యులు సోయం చినబాబు, మండల కార్యదర్శి పులి సంతోష్ కుమార్, మండల నాయకులు కారం సుందరయ్య, పొడియం శ్రీరామ్మూర్తి కమ్మచిచ్చు, సత్యనారాయణ, పిసా కమిటీ కార్యదర్శి గుట్టప్ప గ్రామస్తులు పాల్గొన్నారు.

కడశిల్ప చర్చిలో ఘనంగా గుడ్ ఫ్రైడే వేడుకలు

విశాలాంధ్ర - చింతపల్లి: మండలంలోని కొత్తపాలెం పంచాయతీ కడశిల్ప గ్రామంలో ఉన్న బేర్ సభ, చర్చ్ మందిరంలో పాస్టర్, మత్రి ఆనంద్ ఆధ్వర్యంలో గుడ్ ఫ్రైడే వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పాస్టర్ ఆనంద్ ఏసు క్రీస్తు సిలువలో పలికిన ఏడు మాటలకు సంబంధించి క్రైస్తవ సహోదరి, సహోదరులకు దైవ సందేశాన్ని వివరించారు. కార్యక్రమంలో సంఘ పెద్దలు, విశ్వాసులు, అధిక సంఖ్యలో పాల్గొని గుడ్ ఫ్రైడే, అంటే క్రైస్తవులు అత్యంత పర్వదినంగా చేసుకునే పండగల్లో గుడ్ ఫ్రైడే ఒకటన్నారు. ఈ పండుగ సందర్భంగా విశ్వాసులు ప్రార్థన మందిరంలో ప్రభువును స్మరించుకుంటూ ఘనంగా వేడుకలు జరుపుకున్నారు. అనంతరం ఒకరికొకరు శుభాకాంక్షలు తెలుపుకున్నారు. ప్రభువైన ఏసుక్రీస్తు కల్వరి సిలువలో తన రక్తం చిందించడం వల్ల సర్వమానవాళికి విమోచన కలిగిందని కడశిల్ప మందిర ప్రసంగికుడు (పాస్టర్) మత్రి ఆనంద్ వివరించారు. ఈ వేడుకలలో అధిక సంఖ్యలో క్రిస్టియన్ మత విశ్వాసులు హాజరై ప్రత్యేక ప్రార్థనలు చేశారు.

ఘనంగా గుడ్ ఫ్రైడే వేడుకలు

విశాలాంధ్ర - జియ్యమ్మవలస : మానవాళి రక్షణకై సిలువపై బలైన యేసు క్రీస్తు త్యాగం సర్వ మానవాళికి రక్షణగా నిలిచిందని విచారణ కర్త పాస్టర్ కిషోర్ రాజ్ అన్నారు. గుడ్ ఫ్రైడే సందర్భంగా చినమేరంగి గ్రామంలో పునీత జోజప్ప దేవాలయ విచారణ కర్తలు ఫాదర్ బి. కిషోర్ రాజు ఆధ్వర్యంలో భక్తిశ్రద్ధలతో ఘనంగా గుడ్ ఫ్రైడే వేడుకలు నిర్వహించారు. గ్రామమంతా 14 స్థలాలను ఏర్పాటు చేసి ప్రతి ఒక్క స్థలంలో పవిత్ర పూజలు నిర్వహిస్తూ ఊరేగింపుగా వచ్చారు. అనంతరం జరిగిన దివ్య బలిలో విచారణ కర్తలు పాస్టర్ కిషోర్ రాజు మాట్లాడుతూ మానవాళి రక్షణ కోసం 40 రోజులు ఉపవాస దీక్ష చేసిన ఏసుప్రభును బంధించి కలువ గిరికి శిలువ మోయించి చిత్రహింసలకు గురిచేసి శిలువ వేసిన వారిని సైతం క్షమించమని కోరిన మన ప్రభువైన ఏసుక్రీస్తు నిజంగా మహోన్నతమైన వ్యక్తి అని కొనియాడారు. ప్రతి ఒక్కరూ క్షమాగుణం కలిగి దైవ సేవలో తరలించాలని క్రైస్తవ ప్రజలకు ఆయన పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో బ్రదర్ ఫ్రాంచెస్ ఉపదేశమాస్టార్, జలుమూరు చిట్టి రాజు, సహ ఉపదేశీయులు బొమ్మాలి నాగరాజు, మీసాల సురేష్, అధిక సంఖ్యలో క్రైస్తవులు పాల్గొన్నారు.